క్లుప్తంగా

క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

కల్లూరు: జిల్లా కేంద్రం నంద్యాలలో జరిగిన 27వ ఇంటర్ పాలిటెక్నిక్ క్రీడా పోటీలలో కేవీ సుబ్బారెడ్డి కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఖోఖో, బ్యాడ్మింటన్, లాంగ్‌జంప్, రన్నింగ్ తదితర క్రీడాల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను శుక్రవారం కరస్పాండెంట్ విజయలక్ష్మమ్మ, అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, అధ్యాపకులు, ఫిజికల్ డైరెక్టర్స్ నరసింహులు, రాజు తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి కింద ఇరుక్కుపోయిన లారీ



పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ రైల్వే బ్రిడ్జి కింద శుక్రవారం ఓ లారీ ఇరుక్కుపోయింది. బ్రిడ్జి దాటే క్రమంలో వంతెనకు తగిలి నిలిచిపోయింది. ముందుకు వెళ్లలేక, వెనక్కు రాలేక నిలిచిపోయింది. దీంతో నెరవాడ మెట్ట నుంచి గ్రామంలోకి వెళ్లే వాహనాలు, ఆటోలు కొద్దిసేపు నిలిచిపోయాయి. మరో డ్రైవర్ అతికష్టంగా లారీని సైడ్‌కు తీయడంతో యథావిధిగా రాకపోకలు సాగాయి.

ఆధార్‌లో మార్పులు, చేర్పులు చేయించుకోండి



చిన్నారికి ఆధార్ కార్డు అందజేస్తున్న ఎంపీడీఓ రాణెమ్మ

సి.బెళగల్: ప్రత్యేక ఆధార్ శిబిరాలల్లో సరైన ధృవపత్రాలు అందజేసి మార్పులు, చేర్పులు చేయించుకోవాలని ఎంపీడీఓ రాణెమ్మ ప్రజలకు సూచించారు. మండల పరిధిలోని పోలకల్ గ్రామ సచివాలయం – 2లో నిర్వహిస్తున్న ఆధార్ నమోదును ఎంపీడీఓ తనిఖీ చేశారు. చిన్నారులకు జారీ చేసిన నూతన ఆధార్‌కార్డులను ఎంపీడీఓ అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సునీల్‌రాణి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

22న పవర్ లిఫ్టింగ్ పోటీలు

కర్నూలు (టౌన్): విజయవాడలోని కృష్ణలంక జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో ఈ నెల 22న స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి అండర్–17 బాలబాలికల పవర్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి ఎన్.గిడ్డయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈనెల 21వ తేదీ ఉదయం 9 గంటలకు స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో సంప్రదించాలని సూచించారు.

జాతీయ పోటీల్లో సత్తా చాటాలి

కర్నూలు (టౌన్): తమిళనాడులోని దిండిగల్‌లో ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయస్థాయి జూనియర్ బాలికల హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో సత్తా చాటాలని హ్యాండ్‌బాల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.శ్రీనివాసులు క్రీడాకారులకు సూచించారు. శుక్రవారం నగర శివారులోని ఆదర్శ విద్యామందిర్ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో జాతీయ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు కళాశాల డైరెక్టర్ డాక్టర్ హరికృష్ణ క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే రాష్ట్రజట్టులో సీహెచ్ దేవిక, జి.దేవి, పుష్ప, సీహెచ్ గాయత్రీ, వెంకటలక్ష్మి, ఝాన్సీ, రిషిత, జ్యోతి, హన్సిక, అనన్య, త్రివిధ, లక్ష్మి, శ్రీవాణి, షాహిదా ఉన్నారు.

వాహన పార్కింగ్‌కు చర్యలు



ఆసుపత్రిలో సమస్యల గురించి చర్చిస్తున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో వాహనాల పార్కింగ్‌కు తగిన చర్యలు తీసుకోనున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు చెప్పారు. శుక్రవారం ఆసుపత్రిలోని పలు విభాగాలను ఆయన తనిఖీ చేశారు. కొన్ని విభాగాల వద్ద పార్కింగ్ కోసం స్థలం గుర్తించినట్లు తెలిపారు. న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్, ఫిమేల్ మెడికల్ వార్డు, చిన్నపిల్లల విభాగం, ఓల్డ్ క్యాన్సర్ బ్లాక్ వద్ద ఖాళీ స్థలంలో వాహనాలను పార్కింగ్ చేసేలా చర్యలు చేసుకోవాలని సెక్యూరిటీ సిబ్బందిని ఆదేశించారు. డైట్ విభాగాన్ని పరిశీలించి శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సిబ్బందికి చెప్పారు. స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో క్యాన్సర్ చికిత్సకు ఓపీ నంబర్ 222 విభాగాన్ని త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆసుపత్రిలో డ్రైనేజీ మరమ్మతులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఏపీఎంఎస్‌ఐడీసీ ఇంజినీర్‌కు ఆదేశించారు. డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ సీతారామయ్య, న్యూ డయాగ్నోస్టిక్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సునీల్ ప్రశాంత్, ఆసుపత్రి ఏడీ రమేష్‌బాబు, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రిబాయి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా పని చేయండి

- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి



కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కాటసాని శివనరసింహారెడ్డిని శాలువాతో సత్కరించిన వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్యకర్తలు

కల్లూరు: వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల జిల్లా అధ్యక్షులు బాధ్యతాయుతంగా పని చేయాలని పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సూచించారు. యువజన విభాగం అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి, క్రిస్టియన్ మైనారిటీ సెల్– సుకుమార్, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్– భీమేశ్వరరెడ్డి, విద్యార్థి విభాగం – ప్రశాంత్‌కుమార్, బూత్ కమిటీ విభాగం– బెల్లం మహేశ్వరరెడ్డి, సోషల్ మీడియా విభాగం– రాజశేఖర్‌రెడ్డి, వాణిజ్య విభాగం– అధ్యక్షుడు శ్రీనివాసులు శుక్రవారం కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కాటసాని శివనరసింహారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని అనుబంధ విభాగాల జిల్లా అధ్యక్షులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని నిలదీయాలని, ప్రజలకు అండగా నిలువాలని సూచించారు. కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎక్కడికక్కడ నిలదీయాలని, ప్రజలను చైతన్య పరచాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కార్పొరేటర్ నారాయణరెడ్డి, నాయకులు శివశంకర్‌రెడ్డి, తిరుమలేష్ గౌడ్, హనుమంతురెడ్డి, భాస్కర్‌రెడ్డి, తిరుపాల్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి



ఆధార్ నమోదు పత్రాన్ని అందజేస్తున్న జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి

కర్నూలు(రూరల్): ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధ్యతగా విధులు నిర్వర్తించాలని జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి సూచించారు. మండల పరిధిలో నందనపల్లె గ్రామ సచివాలయాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. హాజరు పట్టికను పరిశీలించారు. సమయపాలన పాటించాలని ఉద్యోగులకు సూచించారు. అదేవిధంగా సచివాలయంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఆధార్ శిబిరాన్ని తనిఖీ చేశారు. మండల పరిధిలో జరుగుతున్న సర్వేలపై ఆరా తీశారు. త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం మండల ప్రజాపరిషత్ కార్యాలయాన్ని సీఈఓ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను ఎంపీడీఓ రఘునాథ్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ అనురాధ, సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి



కులధ్రువీకరణ పత్రాన్ని అందిస్తున్న నంద్యాల ఆర్‌డీఓ విశ్వనాథ్

గడివేముల: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నంద్యాల ఆర్‌డీఓ విశ్వనాథ్ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని మంచాలకట్ట గ్రామంలో జరుగుతున్న రెవెన్యూ సదస్సును ఆర్డీఓ తనిఖీ చేశారు. ప్రతి సోమవారం మండల కేంద్రంతో పాటు జిల్లా కేంద్రంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో దాదాపు 80 శాతం అర్జీలు భూ సమస్యలే అధికంగా వస్తున్నాయి. దీంతో ప్రభుత్వం రెవెన్యూ అధికారుల బృందమే గ్రామాలకు వెళ్లి భూ మస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు సదస్సులు నిర్వహిస్తుందన్నారు. అనంతరం రైతులను నుంచి తహసీల్దార్ వెంకటరమణతో కలిసి అర్జీలను స్వీకరించారు. అదేవిధంగా కులధృవీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ వెంకటసుబ్బయ్య,ఈఓ నాగప్రసాద్,వీర్వోలు ఇందిరమ్మ,హరిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

కోడుమూరు రూరల్: మండలంలోని వర్కూరు గ్రామంలో శుక్రవారం తహసీల్దార్ వెంకటేష్ నాయక్ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. 11మంది రైతుల నుంచి భూ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో ఏడీఏ సాలురెడ్డి, ఏఓ రవిప్రకాష్, వీఆర్వో ఎల్లప్ప, రైతులు పాల్గొన్నారు.

నేడు ఎర్రదొడ్డిలో రెవెన్యూ సదస్సు....

కోడుమూరు రూరల్: భూసమస్యల పరిష్కారంలో భాగంగా శనివారం మండలంలోని ఎర్రదొడ్డి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ వెంకటేష్ నాయక్ తెలిపారు. రైతులు తమ భూ సమస్యలపై వినతులు అందజేసి పరిష్కరించుకోవాలని సూచించారు.

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని మునగాలపాడు గ్రామంలో శుక్రవారం తహసీల్దార్ వెంకటలక్ష్మి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి వినతులు స్వీకరించారు. భూసమస్యలపై రైతుల నుంచి 15 అర్జీలు స్వీకరించామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సూధకర్, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

సి.బెళగల్: మండల పరిధిలోని బురాన్‌దొడ్డి సచివాలయ ఆవరణలో శుక్రవారం తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి వినతులు స్వీకరించిన తహసీల్దార్ ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతామని తెలిపారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఈఓ సీతరామిరెడ్డి, మండల సర్వేయర్ నాగభూషణం, వీఆర్వో మంజీర తదితరులు పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



కొండాపురం రైతులతో సమావేశమైన డీఏఓ వరలక్ష్మి

సి.బెళగల్: బ్యాంక్ రుణాలను కౌలు రైతులు సద్వినియోగం చేసుకోవాని డీఏఓ వరలక్ష్మి సూచించారు. మండలం పరిధిలోని కొండాపురం గ్రామంలో ఏఓ మల్లేష్‌కుమార్, వ్యవసాయ సిబ్బందితో కలిసి ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా రైతులు సాగు చేసిన వేరుశనగ, మిరప, మొక్కజొన్న తదితర పంటలను డీఏఓ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కౌలు రైతుల ఉపయోగార్థం అమలు చేస్తున్న పథకాలు, బ్యాంక్ రుణాల తీరును వివరించారు. అనంతరం సేంద్రియ ఎరువులో రైతులు సాగు చేసిన పంటలను ఆమె పరిశీలించారు. వరి ధాన్యం దిగుబడులపై ఆరా తీశారు. సేంద్రియ ఎరువుల వాడకంపై రైతులు దృష్టి సారించాలని ఏడీఏ సూచించారు. సేంద్రియ ఎరువుల వియోగంతో పెట్టుబడి ఖర్చులు తగ్గడమే కాకుండా అధిక దిగుబడులు పొందవచ్చని చెప్పారు. రైతు రామకృష్టారెడ్డి సేంద్రియ ఎరువులతో సాగు చేసిన వరి ధాన్యాన్ని ఏడీఏ పరిశీలించారు. ఈ వరి ధాన్యాన్ని పరీక్షల నిమిత్తం బెంగుళూరులోని పంపిస్తామని సీడ్ సర్టిఫికేషన్ అధికారి చైతన్యసాగర్ తెలిపారు. కార్యక్రమంలో సీఈఓ మధుసూదన్‌రెడ్డి, ఏఈఓ హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అనిత్‌కుమార్

సి.బెళగల్: పొదుపు మహిళ అభివృద్ధికి వీఓఏలు, గ్రామైఖ్య సంఘాల అధ్యక్షులు కృషి చేయాలని కొత్తకోట ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ అనిత్‌కుమార్ సూచించారు. శుక్రవారం స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో మండల మహిళా సమైఖ్యా (ఎంఎంఎస్)అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి అధ్యతన మండల డీఆర్‌డీఏ – వెలుగు మండల ఏపీఎం రామేశ్వర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు గ్రూపు సభ్యులు బ్యాంక్ ద్వారా పొందిన రుణాలతో వారి కుటుంబాల ఆర్థికాభివృద్ధి సాధించేలా వీఓఏలు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సీసీలు రాముడు, గుండమయ్య, శ్రీనివాసులు, రాములు, ఎంఎస్ అకౌంటెంట్ గోవిందు తదితరులు పాల్గొన్నారు.

అనుమతి ఉన్న మందులనే విక్రయించాలి



పురుగుమందుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ సాలురెడ్డి

కోడుమూరు రూరల్ : వ్యవసాయ శాఖ అనుమతి ఉన్న మందులు, ఎరువులు, విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాని ఏడీఏ సాలురెడ్డి సూచించారు. శుక్రవారం ఏఓ రవిప్రకాష్‌తో కలిసి కోడుమూరులోని పురుగుమందుల దుకాణాలను ఏడీఏ తనిఖీ చేశారు. స్టాక్ రిజిష్టర్లు, రికార్డులను పరిశీలించారు. ఏడీఏ మాట్లాడుతూ ప్రతి దుకాణదారుడు లైసెన్ తప్పనిసరిగా కలిగివుండాలని, ప్రభుత్వ నిర్ణయించిన రేట్ల కన్నా అధికంగా ఎరువులను, మందులను విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. రైతులు కొన్న ప్రతి వస్తువుకు రసీదు ఇవ్వాలని సూచించారు.

రైతు సేవా కేంద్రం తనిఖీ

అంతకుముందు ఏడీఏ సాలురెడ్డి వర్కూరులోని రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఏడీఏ మాట్లాడుతూ రబీ కింద రైతులు సాగు చేసిన ప్రతి పంటను తప్పనిసరిగా ఈనెల 24లోగా యాప్‌లో నమోదు చేయాలని, రైతు సాగు చేసిన పంటలనే నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

22న క్రిస్మస్ కప్ హాకీ టోర్నీ

కర్నూలు (టౌన్): క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని ఈఎస్‌టీ (ఈవాంజిలికల్ సోల్జర్స్ టీమ్) ఆధ్వర్యంలో ఈ నెల 22న స్థానిక ఎస్టీబీసీ కళాశాల క్రీడా మైదానంలో క్రిస్మస్ కప్ హాకీ టోర్నీ నిర్వహించనున్నట్లు హాకీ సంఘం కార్యదర్శి దాసరి సుధీర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో చదువుతూ 16 సంవత్సరాల వయస్సు కలిగిన బాలురు హాకీ టోర్నమెంటులో పాల్గొనవచ్చన్నారు. ఆసక్తి కలిగిన పాఠశాలల జట్లు 99665 65317 సెల్ నంబర్‌ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

చదువుతోపాటు విలువలు అలవర్చుకోవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న అడిషనల్ సెక్రటరీ సునీల్‌రాజ్‌కుమార్

కల్లూరు: విద్యార్థులు చదువులతో పాటు విలువలు అలవర్చుకోవాలని సాంఘిక సంక్షేమ సంస్థల అడిషనల్ సెక్రటరీ (డాక్టర్ బీఆర్ అంబేద్కర్) సునీల్ రాజ్‌కుమార్ సూచించారు. కల్లూరు మండలం చిన్నటేకూరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల ఐఐటీ, మెడికల్ అకాడమీ, జనరల్ కళాశాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆరోగ్యం గురించి, అందిస్తున్న ఆహారం తీరుపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ పరీక్షలనే భయాన్ని విద్యార్థులు వీడాలన్నారు. అకాడమి డైరెక్టర్ ఉమామహేశ్వరప్ప, జనరల్ కళాశాల ప్రిన్సిపాల్ మహనంది కళాశాలలో అదనపు గదులు నిర్మించాలని, మౌలిక వసతులు కల్పించాలని అడిషనల్ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ సంస్థల జిల్లా కోఆర్డినేటర్ శ్రీదేవి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తులసి దేవి, పీడీ చంద్రశేఖర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పాణ్యం: మండలంలోని గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఇన్‌చార్జ్ ఏఈ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. చిలకల సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నా 3 గంటలకు వరకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులుసహకరించాలని కోరారు.

వ్యక్తిపై కత్తితో దాడి

పాణ్యం: మండల పరిధిలోని కొండజుటూరుకు చెందిన మోహన్‌బాబుపై అదే గ్రామానికి చెందిన మహేష్ అలియాస్ బొంబాయి అనే వ్యక్తి కత్తి దాడి చేశారని ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. కర్మఖాండకు సంబంధించినవస్తువులను మహేష్... మోహన్‌బాబు ఇంటివద్ద ఉంచారు. దీంతో ఇలా పెట్టకూడదని మోహన్ బాబు మందలించారు. దీంతో కర్మకండ కార్యక్రమం పూర్తి చేసుకుని వచ్చిన మహేష్ కత్తితో మోహన్‌బాబుపై దాడి చేశారన్నారు. అతన్ని చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కొత్తూరు జీర్ణోద్ధరణ కమిటీ ఎన్నిక

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు ఆలయంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ జీర్ణోద్ధరణ కమిటీని నియమిస్తూ ప్రభుత్వం జీవో ఆర్‌టీ.నం 903 ప్రకారం జీవో ఎంఎస్ నం 649 విడుదల చేసింది. చెర్మన్‌గా గ్రామానికి చెందిన ఎస్ సుబ్బారెడ్డి, ట్రెజరర్‌గా కె నాగపుల్లయ్యను ప్రభుత్వం నియమించింది. అదేవిధంగా సభ్యులుగా బి. రాజేశ్వరమ్మ, ఎన్. సుబ్బారెడ్డి, ఏ.పెద్దరాయుడు, జి. రామసుబ్బయ్య, టి. పుల్లయ్య, సి. మద్దిలేటి, ఎస్. దిబ్బ నరసింహులు ఎంపిక అయ్యారు.

22న ఉప్పర సంఘం సమావేశం

కర్నూలు(అర్బన్): ఈ నెల 22వ తేదీన ఏలూరులో సగర, ఉప్పర సంఘం రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు సగర, ఉప్పర రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు ఉప్పరి సురేష్ తెలిపారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో సురేష్ మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాలు గడిచిపోయినా, ఉప్పర సామాజిక వర్గానికి రాజ్యాంగ పరమైన హక్కులు లభించలేదన్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో ఉప్పర, సగర సామాజిక వర్గం ఇంకా వెనుకబడే ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉప్పర, సగర సామాజిక వర్గాన్ని ఒకే తాటి మీదకు తెచ్చేందుకు ఈ సమావేశం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రాజకీయాలకు అతీతంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉప్పర, సగరులందరూ ఈ సమావేశానికి హాజరుకావాలని కోరారు.

'పీజీఆర్‌ఎస్'కు స్పందన కరువు



సి.బెళగల్ మండల పరిషత్‌లో పీజీఆర్ఎస్‌లో అర్జీదారులు లేక ఖాళీగా కూర్చున్న అధికారులు

సి.బెళగల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెండవ రోజు శుక్రవారం చేపట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రత్యేక శిబిరానికి (పీజీఆర్ఎస్) మండల ప్రజల నుంచి స్పందన కరువైంది. ప్రభుత్వం సుపరిపాలన వారోత్సవంలో భాగంగా ప్రతిష్టాత్మకంగా ఈ నెల 19 నుంచి 24వ తేది వరకు పీజీఆర్ఎస్ ప్రత్యేక శిబిరం కార్యక్రమం చేపట్టింది. అయితే మొదటి రోజు గురువారం కార్యక్రమానికి ఒక్క దరఖాస్తు మాత్రమే రాగా, రెండవ రోజు కనీసం ఒక్క వినతి కూడా రాలేదు. మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ జయప్రకాష్, జూనియర్ అసిస్టెంట్ మంజుల కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల ప్రజల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో అర్జీలు నిల్‌గా నమోదు అయ్యింది. అయితే కార్యక్రమ నిర్వహణ, సమస్యల పరిష్కారంపై అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందనే విమర్శలు ఉన్నాయి. ఏ మాత్రం ప్రజలకు ముందస్తు సమాచారం లేకుండా ప్రచారార్భాటం చేసుకుంటున్నారని వాపోతున్నారు ప్రజలు.

పురాతన ఆలయాల జీర్ణోద్ధరణకు ప్రభుత్వం కృషి చేయాలి

కోడుమూరు రూరల్ : దూపదీపారాధనలకు నోచుకోని పురాతన ఆలయాల జీర్ణోద్ధరణకు ప్రభుత్వాలు కృషి చేయాలని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి సూచించారు. మండల కేంద్రం కోడుమూరులోని శ్రీరాములవారి ఆలయంలో శుక్రవారం నిర్వహించిన హైందవ శంఖారావం సభ సన్నాహక సమావేశాని ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ హిందూ బంధుమిత్రులంతా హిందూ ధర్మం యొక్క గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలన్నారు. హిందువుల భవిష్యత్ కార్యాచరణలో భాగంగా 2025జనవరి 5న విజయవాడలో జరిగే హైందవ శంఖారావ సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీజేపీ దక్షిణాంధ్ర ప్రాంత అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు నీలకంఠ, లక్ష్మీవెంకటేశ్వరరెడ్డి ఆలయ కమిటీ చైర్మన్ ఎద్దుల మహేశ్వరరెడ్డి, వీహెచ్‌పీ జిల్లా నాయకులు మహేష్, నాగరాజు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.